జి. ఆర్. జోగారావు

ఎం. ఏ. ప్యాసు అయిన తర్వాత ఆరోజుల్లో యే యూనివర్సిటీలో నేనా రిసెర్చి స్కాలర్ క్రింద ప్రవేశిద్దామని అనుకునే వాణ్ని. కాని the academic month of the year జూలై రావడంతోటే ఆ లైను లోనూ వున్న పటాటోపం చూచి నా వుద్దేశానికి స్వస్తి చెప్పేను. అయితే తీరిగ్గా కూర్చుని చేసే దేమిటని ప్రశ్న. అంచేత మనకి అందు బడిలో వున్న మరి దేన్నైనా రిసెర్చి చేసి ప్రపంచానికి నేనూ వొక ఘనుణ్ణే అని చాటాలని ప్రయత్నం. ఆలోచించి నా మెటీరియల్ క్రింద 'స్త్రీ'ని తీసుకున్నాను. దానికి తగ్గ laboratory పదార్థము వుండాలి మరి. సిటీలో వో మేడలో రెండో అంతస్థు అద్దెకి తీసుకున్నాను. ఏడాదాయి పుట్టింటి దగ్గరే వున్న రాణీగారిని రప్పించేను పరీక్ష చెయ్యడానికి.

పల్లె కూతలతోటి ప్యాక్టరీల్లోని రాక్షసబొగ్గు ధూమముతోటి, మోటారుల రాపిడిచే చెలరేగిన రోడ్లమీది ధూళితోటి, కాక కోయిల మధుర గానముచేతను పరిసర కొండ ప్రాంతముల దిరుగు గొల్లల యఅ్రుల చేతను, వూడుపు లూడ్చు స్త్రీల పాటలచేతను నిండిన స్వచ్ఛంద వాతావరణములో పుట్టి పెరిగింది విమల. అందుచే ఆమె సృష్టిసౌందర్యమును ఆనందింప కలిగింది. సృష్టి యొక్క యాశయమును గ్రహించింది. పావురముల జంటను చూడండి. మొగపిట్ట, ఆడపిట్ట యెంత అన్యోన్యంగా వుంటాయో! పోనీ నిత్యం మనం చూస్తూన్న పిచ్చుకలను చూడండి. మొగపిట్ట, ఆడపిట్ట చేసే వేర్వేరు పనులు, వాటి జీవన విధానము మానవునికి బుద్ధి చెపుతాయి. సూర్య చంద్రులు ఆకాశం మీద యెందుకలా ప్రకాశిస్తున్నాయి? నదు లెందుకలా ప్రవహిస్తున్నాయి? వృక్షములు ఫలముల నెందుకు ప్రసాదిస్తున్నాయి? వాట్ల వుపయోగం కోఅకు గాదే. మరొకరి వుపయోగానికి. పరోపకారం సృష్టియొక్క ఆశయాల్లో వొకటి. ఇవీ విమల నాకు సృష్టి వైచిత్ర్యాలను గూర్చి చెప్పే కథలు.

రెండు నెలలు పరిశీలించేను ఆ అమ్మాయిని. స్వేచ్ఛ యిచ్చేను. సృష్టినిబట్టి కొలతబెట్టి కావలసినంత స్వేచ్ఛ తీసుకుందామె. నా డైరీలో వ్రాసుకున్నాను.

సృష్టియొక్క ఆశయమును గ్రహించి, సృష్టి సౌందర్యమును ఆనందించిన స్త్రీకి స్వేచ్ఛ యొసంగినా చలింపదు" అని.

ఆవేళ సాయంత్రం కొంచెం వేగంగా వచ్చేశా యింటికి. ఆమె ముందు వసారాలో పిట్టగోడ నానుకొని నిలబడ్డది. ఎదురువైపు మేడపై వో యువకుడు పచారు చేస్తున్నాడు. మేడపైకి రావడంతోటే 'యువరాయన?' అని ప్రశ్నించేను మాటవరసకి. విమల నేటిస్థితికి నేను అనుమానింపలేను. అట్టి వుద్దేశ్యంతో కూడా నేను ప్రశ్న వేయలేను. 'మీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు' అని ఆమె అమాయకంగా జవాబు చెప్పింది. అటువంటి విమలని అనుమానించడం గొప్ప పొరపాటు. అనిమానిస్తే నారిసర్చికి విలువ యేదీ మరి?

మూడు రోజులు గడిచాయి. రాత్రి యింటికొచ్చేసరికి విమల ముచ్చటగా ముస్తాబయింది. నేను కొంత మురిసి పోయేను. ఆమె సౌందర్యం నన్నానందింప చెయ్యడానికేగా మరి. గదిలోకి పోయాను. గాలికి టేబిలు మీది కాగితములు కొన్ని యెగిరి నేలమీద పడి వున్నాయి. వాటిని తీసేను. అందులో వొక వుత్తరం కనబడ్డది. చదివేను. 'రాత్రి నిన్ను కలుసుకుంటా' నని విమల కాతడు వ్రాసేడు.

'ఇట్టి రహస్యమైన కాగితం టేబిలుమీదిలా యెందుకు వదిలిందా' అన్న ప్రశ్న మిగిలేగ నాకూ కలిగింది.



దాని నిజానిజాలు కనుక్కుందామని నిర్లక్ష్యంగా వూరుకున్నాను. వూళ్లో గడియారం వంటిగంట కొడుతూంది. నాకు మెలకువ వచ్చింది. ఆమె మంచం మీద లేదు. వెన్నెట్లో మెట్లమీద మాట్లాడుతున్నారు అతడూ ఆమె. లోపలికి పోయాను. మనసులో వొక విధంగా దృఢపరచుకున్నాను. అందుచే నిశ్చలంగా నిద్ర పట్టింది. ఉషః కాంత మేలుకొలుపు గీతికలు నా సుషుప్తినుండి లేవగొట్టాయి. ఆమె నిర్భయంగా పడుకున్నది తన మంచంమీద.

'విమలా!'

ఆమె లేవలేదు.

'విమలా!'......గట్టిగా.

ఆమె తటాలున లేచి కూర్చుంది కనులు నులుముకుంటూ.

'నీవు వెంటనే నాయిల్లు విడిచి వెళ్లిపో.'

ఆమె మారు మాటాడ లేదు. తలుపు తీసుకొని మెట్లు దిగి వెళ్ళిపోయింది యెచటికో.

విమల వెళ్ళిపోయిందని నాకేమీ విచారము లేదు. నారిసెర్చి తగలబడి పోయిందని తల గొట్టుకున్నాను. ఏం లాభం గనక?

మూడోరోజు సాయంత్రం ముందు వసారాలో నించున్నాను శూన్యంగా వీధికేసి చూస్తూ. ఎదురు మేడపై రోజూ కనబడని స్త్రీ విగ్రహం మేలి ముసుగుతో ప్రత్యక్షమైంది. అతడు వంగదేశీయుడా అయితే? మరి మూడు రోజుల వరకు ఆమె నాదృష్టి పథమును తప్పిపోలేదు. గదిలోంచి డాబామీదికి వస్తూనే వుంది పని లేకపోయినా. చిన్న నాటకం ఆడదామని వూహించేను. అతనికి ప్రతిక్రియ చెయ్యడానికి కూడా వీలు కలిగింది. ఈ మార్గంగా వుత్తరం వ్రాశాను, 'నిన్నిరాత్రి కలుసుకుంటా'నని. 'ఒంటిగంటపైని మీయింటికే వస్తా'నని ఆమె జవాబు.

ఒంటిగంటకే సరిగ్గా ఆమె హాజరయింది. గదిలోకి ఆహ్వానించేను. విమలకోసం ప్రేమ పూర్వకంగా చేయించిన 'బ్రోచ్' టేబిలుమీద వుంది.

'ఇది నేముట్టుకో వచ్చా?'

'అది నీవు తీసుకోవచ్చు' అన్నా నేను.

ఈవిధంగా విమలని సాధించేనని నే ననుకున్నాను. ఆమె మేలి ముసుగుతో మంచంమీద కూర్చుంది.

'మీరు నన్నెందుకు పిలిచారు?'

నా కంఠము మూగబోయింది.

కన్నులతోటే జవాబు చెప్పేను.

ఆమె మేలి ముసుగు తియ్యమని ప్రార్థించేను. తియ్యనంది. ఒక అరగంట ఆమె కూర్చుంది.

'సరే మరోసారి వస్తా.'

ఆమె నా జవాబుకోసం నిరీక్షించకుండానే దారి తీసింది. నే నెంత మూర్ఖపు పని చేశాను.

ఆ యాలోచన్లో నిద్ర పట్టింది.

ఉదయాన్నే తలుపెవరో తట్టిన చప్పుడు.

విమల అతడు ప్రత్యక్ష మయేరు. రాత్రి అమె తీసుకుపోయిన బ్రోచ్ విమల వక్షస్థలంమీద దీపిస్తూంది.

'నీవు మళ్లా యెందుకు వచ్చావు?'

'నేను మీ ప్రియురాలిని. అప్పుడే మరిచారూ? మరోసారి వస్తానన్నా కదూ?'

నేను తెల్లబోయేను. విమ లిలా చెప్పుకొచ్చింది. నేను వ్రాసిన డైరీలోని సిద్ధాంతము చదివిందట. నన్ను వంచించాలని నిశ్చయించుకుంది. ఆ మధ్యాహ్నామే కలకత్తానుండి వాళ్ల అన్న వచ్చాడు. అతడే యితడు. వాళ్లిద్దరూ కలిసి యిలా నాటకం ఆడించేరు నన్ను. ఇపుడంతా తెల్లమయింది నాకు.

అబ్బా! ఆడదాని కెంత సాహసము, యెంత గోప్యం, యెంత యుక్తి. 'స్త్రీ' అనే పదార్థముయొక్క properties అన్నీ కనుక్కుందామంటే యెవరి తర మవుతుంది బాబూ! అలాంటి విషయంలో నారిసెర్చి యెంతవరకు సాగుతుందో మీరే వూహించండి.


చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

గొనోకిల్లర్ (రిజిష్టర్డు)

కృత్రిమములకు జాగ్రత్త "కోడి మార్కు"ను చూచి కొనుడు.

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలననుగూడ లాభము లేక పోయినయెడలను, కడపటిప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గొనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రముపోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. శగవ్యాధి (గొనోకోకసు) వలన మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, మూత్రద్వారముయొక్క చుట్టు వుండు పొరయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరముల జబ్బు మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను) పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా ట్రేడుమార్కు గమనింపుడు. వీ. పి. చార్జి ప్రత్యేకము. అడ్రసు:—డాక్టరు డి. యన్. జస్సాని, గిర్‌గాను వెనుకరోడ్డు, బొంబాయి, 4.

Dr. D. N. JASANI, Girgaon Back Road, Bombay, 4.

Madras Agents :—DADHA & Co., 52, Nainiappa Naick St., P. T., Madras.




-౨౮౯